ఆదర్శప్రాయుడు సుందరయ్య

సాలూరు:

సమాజం కోసం జీవితాన్ని త్యాగం చేసిన దివంగత స్వాతంత్ర్య సమరయోధుడు, సీపీఎం నాయకుడు పుచ్చలపల్లి సుందరయ్య ఆదర్శప్రాయుడని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎన్వైనాయుడు అన్నారు. ఈ మేరకు సోమవారం పుచ్చలపల్లి వర్ధంతి సందర్భంగా మున్సిపల్ కార్యాలయం ఆవరణలో సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. స్వాతంత్ర్య సమరయోధుడిగా, సీపీఎం నాయకుడిగా, రాజకీయనాయకుడిగా అయన చేసిన నిస్వార్థ, నిరాడంబర సేవలను గుర్తుచేశారు. పార్లమెంటుకు సైకిల్‌పై వెళ్లి ప్రజాజీవితాన్ని ,ప్రజాప్రతినిధిగా నిరాడంబరంగా గడిపిన వ్యక్తి సుందరయ్య అని కొనియాడారు. నేటి తరానికి ఆయన ఆదర్శప్రాయుడని, ఆయన స్ఫూర్తితో అందరం ప్రజాసమస్యలపై పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో నాయకులు శంకర్రావు, లింగరాజు, రాముడు తదితరులు పాల్గొన్నారు.

బలిజిపేటలో..

బలిజిపేట: పుచ్చలపల్లి సుందరయ్య ఆదర్శప్రాయుడని సీపీఎం సీనియర్ నాయకుడు జి.సత్యనారాయణ కొనియాడారు. ఈ మేరకు బలిజిపేట సీఐటీయూ కార్యాలయంలో సీపీఎం మండల కమిటీ సభ్యుడు బి.భానుమూర్తి అధ్యక్షతన సుందరయ్య వర్ధంతి కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ రాజకీయ, సామాజిక, ఆర్థిక రంగాల్లో ఒక కొత్త మార్గాన్ని చూపిన మహావ్యక్తి సుందరయ్య అని కొనియాడారు. కార్యక్రమంలో జి.సత్యనారాయణ, మన్మథరావు తదితరులు పాల్గొన్నారు.

సీతానగరంలో..

సీతానగరం: దక్షిణ భారత కమ్యూనిస్ట్ ఉద్యమ నిర్మాత, ఆదర్శ రాజకీయనేత కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 40 వర్ధంతి సభ సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం జరిగింది. ఈ మేరకు సీఐటీయూ నాయకుడు వెంకటరమణ ముందుగా పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అసంఘటిత కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

గ్రంథాయలం ఏర్పాటు చేయాలి

పార్వతీపురంటౌన్: పార్వతీపురం మున్సిపాల్టీలో గ్రంథాలయం ఏర్పాటు చేయాలని జగన్నాథపురం యువత డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరెట్ వద్ద నిరసన తెలిపారు. అనంతరం కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్.వివేక్ మాట్లాడుతూ 26, 29, 2 వార్డుల్లో చాలామంది యువత చదువుకుని పోటీపరీక్షలకు సన్నద్ధమవుతున్నారన్నారు. గ్రామంలో వ్యవసాయ ఆధారిత, సామన్య, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన యువత పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలు కొనుక్కొనే స్తోమత తక్కువ ఉందన్నారు. జగన్నాథపురం గ్రామంలో ఎంఈ స్కూల్ పక్కన గల ఒరియా స్కూల్ గదులు ప్రస్తుతం ఖాళీగా ఉన్నాయని, ఆ స్కూల్ తరగతి గదులలో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసి పోటీ పరీక్షలకు అవసరమైన మెటీరియల్స్ మంజూరు చేయాలని కోరారు.

మా భూములు ఆన్‌లైన్ చేయండి



కలెక్టరేట్‌వద్ద నిరసన తెలుపుతున్న లిడికివలస గ్రామస్తులు

పార్వతీపురంటౌన్: తాము పోడు వ్యవసాయం చేసుకుంటున్న భూములను ఆన్‌లైన్ చేయాలంటూ పార్వతీపురం మండలం కొత్తలిడికివలస గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన తెలియజేశారు. అనంతరం కలెక్టర్ ఎ. శ్యామ్‌ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో లిడికివలస గ్రామస్తులు చోడిపల్లి గణేష్, మెల్లక అశోక్, మాలతి, కుసుమ, శ్రీను, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్లు అప్పగించండి

పార్వతీపురంటౌన్: గత ఎనిమిదేళ్లుగా ఆశగా ఎదురుచూస్తున్న లబ్ధిదారులకు టిడ్కో ఇళ్లు కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా చైర్మన్ వంగల దాలినాయుడు సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీ వాస్తవను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు తీళ్ల గౌరీ శంకరరావు తదితరులు పాల్గొన్నారు.



శ్యామలాంబ పండగ సందడి

- ఇళ్ల వద్ద ఏర్పాట్లలో నిమగ్నమైన పట్టణ ప్రజలు
- జనరేటర్‌లు, ఇన్వర్టర్‌లకు పెరిగిన డిమాండ్

సాలూరు:

శ్యామలాంబ పండగ నేపథ్యంలో పట్టణ వాసులు ఓ వైపు అమ్మవారి పూజల గురించి ఆలోచిస్తూనే మరోవైపు ఇళ్లకు పిలిచిన స్నేహితులు, బంధువుల కోసం ఏర్పాట్లుచేయడంలో నిమగ్నమయ్యారు. కరెంట్ కోతలు అధికంగా ఉండడంతో హై కెపాసిటీ ఇన్వర్టర్‌లు, జనరేటర్‌ల వైపు ఆసక్తి చూపారు.

నాటుకోళ్లకు పెరిగిన డిమాండ్

కాగా మంగళవారం అమ్మవారికి మొక్కుల చెల్లింపులకు నాటుకోళ్లకు భలే డిమాండ్ ఏర్పడింది. పట్టణంలో నాటుకోళ్ల విక్రయాలు ముమ్మరంగా సాగాయి. కోడి పరిమాణం ఆధారంగా రూ.500 నుంచి రూ.2 వేల మధ్య విక్రయాలు జరిగాయి. చేప,మేక, కోడి మాంసం దుకాణాలు మంగళవారం విక్రయాలకు సిద్ధమయ్యాయి.

మతసామరస్యం చూపిన ముస్లిం సోదరులు

పండగ నేపథ్యంలో పట్టణంలోని ముస్లిం సోదరులు మతసామరస్యాన్ని చూపించారు. మండుటెండలో భక్తుల దాహార్తిని తీర్చేందుకు పలు స్వచ్ఛంద సంస్థలు, ప్రముఖులు మజ్జిగ, నీటి పంపిణీ చేపట్టాయి. ముస్లిం సోదరులు కూడా మజ్జిగ, తాగునీరు పంపిణీ చేసి మత సామరస్యాన్ని చాటుకున్నారు.



విక్రయానికి సాలూరు తీసుకువచ్చిన నాటుకోళ్లు



కోలాటం ఆడుతూ వస్తున్న భక్తులు



క్యాబ్‌లో తరలిస్తున్న షామియానా సామగ్రి

కొరవడిన పారిశుద్ధ్యం

లక్షల్లో భక్తులు అమ్మవారి పండగ నేపథ్యంలో వస్తుండగా పట్టణంలో పారిశుద్ధ్య లోపం తాండవిస్తోంది. పలు వీధుల్లో కాలువల్లో మురుగునీరు నిండి రోడ్ల మీదకు వస్తోంది. కుళాయి పైప్‌లైన్లు పగిలిపోయి రోడ్లు మీదకు నీరు చేరుతోంది.



మజ్జిగ పంపిణీ చేస్తున్న ముస్లిం సోదరులు





































